# ప్రచారం పరిసమాప్తం

- సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి
- ఇంటింటికీ ఓటర్ స్లిప్పుల పంపిణీ
- ఓటు హక్కుపై ఊరూరా అవగాహన
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



మహబూబ్‌నగర్‌లో ఎన్నికల విధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం పరిసమాప్తం కావడంతో కీలక ఘట్టానికి తెరలేచింది. గురువారం పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. గెలుపే లక్ష్యంగా ప్రచారం చేసిన రాజకీయ పార్టీలు మంగళవారం సాయంత్రం 5గంటలకు ప్రచారాన్ని ముగించడంతో మైకులన్నీ మూగబోయాయి. 15 రోజులుగా పట్టణాలు, గ్రామాలన్న తేడా లేకుండా ఉదయం నుంచి రాత్రి 10గంటల వరకు మైకులు డీజే సాంగ్‌లతో హోరెత్తించారు. చివరిరోజు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఆయా పార్టీలు రోడ్ షోలతో అదరగొట్టేశాయి. ఓటర్లను ఆకర్షించేందుకు పక్షం రోజులుగా ప్రయత్నించిన రాజకీయ పార్టీలు ఇక ప్రలోభాలకు తెరతీశాయి. ఎన్నికల ఘట్టం ప్రారంభం కాగానే కాంగ్రెస్ పార్టీ కుతంత్రాలకు తెరతీసింది. బీఆర్‌ఎస్ పార్టీ సర్పంచులను, ఇతర ప్రజాప్రతినిధులను కొనుగోలు చేసేందుకు భారీ ఆఫర్లు ఇచ్చినా పార్టీలు మారకపోవడంతో కంగుతిన్న హస్తం పార్టీ నేతలు ఇక డైరెక్ట్‌గా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో భారీఎత్తున కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుల వద్ద కోట్లాది రూపాయల నగదు, భారీ మద్యం పట్టుబడ్డాయి. ఓటర్లను ప్రలోభపెట్టేందుకే వీటిని తరలిస్తున్నారని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. పోలీసు భద్రత మధ్య పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఓటింగ్ సరళిని మొత్తం సీసీ కెమెరాలో రికార్డు చేయనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక పోలింగ్ కేంద్రాల్లో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈసారి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్తగా హోం ఓటింగ్‌ను అధికారులు నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీస్ చెక్‌పోస్ట్‌లు పెట్టి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో మద్యం భారీగా ఓటర్లకు ఆఫర్ చేస్తుండడంతో ఎన్నికల పరిశీలకులు ఆయా మద్యం దుకాణాలను ఇది వరకే తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. నారాయణపేట జిల్లాలో కాంగ్రెస్ నాయకులు మద్యం కోసం చిట్టీలు రాసి ఇస్తున్నారనే ఆరోపణలతో రెండు వైన్ షాపులను సీజ్ చేశారు. పోలింగ్‌కు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నారు.

**దాడులకు తెగబడ్డ కాంగ్రెస్..**

ఎన్నికల ప్రచార సమయంలో ఓటమిని అంగీకరించలేని కాంగ్రెస్ నాయకులు దాడులకు తెగబడ్డారు. అచ్చంపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజుపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. కొడంగల్, కోస్గి, మద్దూరు మండలాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలను గాయపరిచారు. అనేక చోట్ల బీఆర్‌ఎస్‌కు వస్తున్న ఆదరణను చూడలేక అనేక చోట్ల ప్రచారాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ సభల్లో ప్రజలు మీరేం చేశారని నిలదీసినా అవన్నీ బీఆర్‌ఎస్ ప్రయత్నమేనని ప్రత్యారోపణలకు దిగారు.

**పోలింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు..**

మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న పోలింగ్‌కు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కలెక్టర్లతో కలిసి అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా గతంలో వచ్చిన ఫిర్యాదులను బట్టి ఓటర్లకు అవసరమైన చోట పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఈవీఎంలను ముందస్తుగా తనిఖీలు నిర్వహించి వాటిని భారీ భద్రత మధ్య నియోజకవర్గ కేంద్రాలకు తరలించారు. బుధవారం వీటిని భారీ బందోబస్తు మధ్య ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలిస్తారు. ఇప్పటికే ఓటింగ్‌కు అవసరమైన ఓటర్ స్లిప్పులను అందజేశారు. తుది ఓటరు జాబితాను ప్రకటించి ఆయా కేంద్రాలకు పంపించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన టెంట్లు, తాగునీరు, వైద్యం తోపాటుఅన్ని సౌకర్యాలను కల్పించారు. వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు అవసరమైన వీల్ చైర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకుల తోపాటు కలెక్టర్లు పూర్తి స్థాయిలో పరిశీలించారు.

**సమస్యాత్మక ప్రాంతాల్లో భారీ బందోబస్తు..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా జిల్లాలో పోలీస్ బలగాలతో పాటు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కేంద్ర బలగాలను రంగంలో దింపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక పోలీసులను కూడా బందోబస్తులో వినియోగించుకుంటున్నారు. గత ఎన్నికల్లో సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన గ్రామాలను ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించారు. మరోసారి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఓటర్లు ఓటు వేసేందుకు భారీ భద్రత చర్యలు చేపట్టారు. ఇదే కాకుండా స్ట్రైకింగ్ ఫోర్స్ కూడా అందుబాటులో ఉంచారు. ఎక్కడ ఎలాంటి ఘటన జరిగినా వెంటనే చేరుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అవసరమైతే 144 సెక్షన్‌ను అమలు చేస్తామని పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలోనే నిలిపి పార్టీ కండువాలు లేకుండా, ప్రచారం చేయకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్‌కు సర్వంసిద్ధం కావడంతో మిగిలిన 48గంటల సమయం మాత్రమే మిగలడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు మునిగిపోయారు.

## తెలంగాణ ఆగమైతది..



స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి దశాబ్దాల పాటు కాంగ్రెస్ పాలించింది. వీరి హయాంలో వ్యవసాయ రంగం పూర్తిగా నీరుగారింది. దీంతో రైతులు ఎన్నో కష్టాలు పడ్డారు. కరెంట్ కోసం పొలాల వద్ద రాత్రిళ్లు జాగారం చేసేటోళ్లు. సాగునీరు లేక బోర్లన్నీ ఒట్టిబోయి కర్షకులెందరో ఆత్మహత్యలు చేసుకున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ఆ పార్టీకి ఓటర్లతో చెక్ పెట్టారు. తర్వాత సీఎం కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగం కొత్తపుంతలు తొక్కింది. 24 గంటల కరెంట్‌తోపాటు రైతు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో రైతు రాజుగా మారాడు. అయితే ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లా కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేయాలని చూస్తుంది. తెలంగాణ రైతులపై పగబట్టిన హస్తం పార్టీ నేతలు ఎలాగైనా అధికారంలోకి రావాలని కుట్ర పన్నుతున్నారు. అమలుకు సాధ్యంకాని హామీలన్నీ ఇస్తున్నది. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలని, రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఉచిత సలహా ఇస్తున్నాడు. మళ్లా ఆ పార్టీ వస్తే తెలంగాణ ఆగమే.. వ్యవసాయ రంగంతోపాటు ఆహార భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నది. భూముల ధరలు పడిపోనున్నాయి. ఉపాధి లేక జనం మళ్లా వలస బాట పట్టే అవకాశం ఉన్నది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమయ్యే అవకాశం ఉన్నది. అలాంటి పార్టీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలి

**- రావుల గోపాల్‌రెడ్డి, నాయపల్లి, దేవరకద్ర మండలం**

## సాగు విస్తీర్ణం తగ్గుతుంది



తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు చెప్పే మాటలు నమ్మితే ఆగం కావాల్సిందే.. ఇప్పటికే వ్యవసాయానికి 24 గంటల కరెంట్ వద్దని, 3 గంటలే చాలని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని రేవంత్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వీరి మాటలు నమ్మి అధికారం కట్టబెడితే రాష్ట్రం అధోగతి పాలు కావడం ఖాయం. సాగునీటి, కరెంట్ కష్టాలు మొదలవుతాయి. పంటలతోపాటు సాగు విస్తీర్ణం తగ్గిపోయే ప్రమాదం ఉన్నది. తెలంగాణవచ్చాక పదేండ్లలో కష్టపడి సాధించిన గ్రామాల్లో ఆర్థిక వ్యవస్థ తగ్గిపోయే ప్రమాదం ఉన్నది. పల్లెల్లో 70 శాతం సాగునే నమ్ముకొని జీవిస్తున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైతది. మళ్లీ వలసలు మొదలవుతాయి. భూముల ధరలు పడిపోతాయి. రాష్ట్రంలోని రైతులకు నిరంతర కరెంట్ అవసరం లేదని ప్రకటిస్తున్నారు. కరెంట్ కోతలు పెడితే ఎత్తిపోతల పథకాలను అంత కరెంట్ పెట్టి ఏం నడుపుతారు. ఇక సాగునీటికి కష్టకాలమే.. ధరణి ఎత్తేసే కుట్ర జరుగుతున్నది. పక్కనే ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయానికి 5 గంటలు మాత్రమే కరెంట్ ఇస్తున్నారు. రాష్ట్రంలో మాత్రం వ్యవసాయానికి 3 గంటలు కరెంట్ సరిపోతుందని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చెబుతున్నాడు. అది ఏ చేనుకు.. ఏ మూలకూ సరిపోదు. కర్ణాటకలో ప్రకటించిన ఐదు హామీలు ఒక్కటి కూడా సక్రమంగా నెరవేర్చడం లేదని అక్కడి రైతులు వాపోతున్నారు. మీరూ మాలాగా ఇబ్బందులు పడొద్దని హెచ్చరిస్తున్నారు. అందుకే 24 గంటల కరెంట్ అందించే సీఎం కేసీఆర్‌నే మరోసారి ఆశీర్వదించాలి.. రైతు సంక్షేమ ప్రభుత్వం మళ్లా రావాలె.

**- కిష్టప్ప, రైతు, బండగొండ, నారాయణపేట జిల్లా**

## రైతులపై పగబట్టిన కాంగ్రెస్..



కాంగ్రెస్ రైతులపై పగబట్టింది. అలాంటి పార్టీ రాష్ట్రంలో అధికారంలోకివస్తే బతుకులు ఆగమైతయి. రైతుబంధులో కౌలుదారులు, రైతుల పంచాయితీతో శాంతిభద్రతలకే ముప్పు వాటిల్లనున్నది. కరెంట్‌ను కోతల మయం చేసి భూమికి భద్రత లేకుండా చేస్తారు. రైతుబంధుకు గండం పెడితే సాగు విస్తీర్ణం పడిపోతది. కౌలుదారు కాలం వస్తే పంటలు పండించలేని వారు సైతం అవసరమైతే పొలాలను బీడుగా ఉంచుతారు. గ్రామీణ స్థాయిలో ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. కరెంట్ కష్టాతో లిఫ్ట్ మోటర్లు సాగునీరు పారించవు. కౌలుకు భూములు ఇవ్వరు.. రైతు ఆత్మహత్యలు పెరుగుతాయి. అదనపు ఆదాయం కోల్పోతారు. రైతుబంధు పెట్టుబడి సాయం పట్టాదారుడికి లేదా కౌలురైతుల్లో ఒకరికే ఇస్తామంటూ చెబుతుండడం సరికాదు. అలాగే ధరణికి బదులుగా భూమాతను పెడుతామని భట్టివిక్రమార్క చేస్తున్న కౌలుదారు కాలం పెడితే రైతుబంధు సాయం కేవలం పెట్టుబడి కౌలుదారుకు ఇస్తే పట్టాదారులు తమ భూములను బీళ్లుగాపెట్టుకోవడం ఖాయం. భూముల ధరలు పడిపోతయ్.. ఉపాధి కరువై మళ్లా వలసలు మొదలువుతాయి. ఈ ప్రాంతం బీడుబారిపోతది. కాంగ్రెస్ నాయకులు చెబుతున్నదంతా తన్నుకచావడానికే మరోటి లేదు. వారి వరుస ప్రకటనలు రైతులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఇది మంచి పద్ధతి కాదు. సీఎం కేసీఆర్ పాలనే బాగుంది.. ఆయనే మరోసారి హ్యాట్రిక్ సీఎం కావాలని రైతులు కోరుతున్నారు. కాంగ్రెసోళ్లు ఎదుటి వారు బాగుపడితే తట్టుకోరు.

**- పాత్లావత్ బాలునాయక్, రైతు, ముక్కిడిగుండం, కొల్లాపూర్ మండలం**

# వరి తాళ్లు..ఉరి తాళ్లే..!

- కాంగ్రెస్‌తో అభివృద్ధి వెనక్కి..
- పడిపోనున్న సాగు విస్తీర్ణం
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నాశనం
- పాతాళానికి భూముల ధరలు
- ఉపాధి కరువై మళ్లీ వలస బాట
- కాంగ్రెస్ వద్దు.. బీఆర్‌ఎస్సే ముద్దంటున్న రైతులు

వనపర్తి, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : తొమ్మిదిన్నరేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో పల్లెలు, పట్నాలు సుందరంగా మారడంతో అభివృద్ధి పరుగులు పెట్టి బంగారు తెలంగాణగా మారుతున్నది. ఈ తరుణంలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్‌కు చాన్స్ ఇస్తే రాష్ట్రం పదేండ్లు వెనక్కి పోయే ప్రమాదం ఉన్నదని రైతులు హెచ్చరిస్తున్నారు. సమైక్య పాలనలో నట్టేట మునిగాం.. మళ్లా వారి పాలన వద్దే వద్దు అన్న ప్రకటనలు వెల్లువెత్తుతున్నాయి.

**ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యమే..**

కాంగ్రెస్ పాలనొస్తే తెలంగాణఆగం కావాల్సిందే. 60 ఏండ్లు పాలించిన హస్తం పార్టీ దేశానికి, రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదు. నాడు వ్యవసాయం అంతంతే.. రైతుల కష్టాలు వర్ణణాతీతం.. ఎరువులు కావాలన్నా.. విత్తనాలు కావాలన్నా.. ఆందోళనలు, క్యూలైన్లు తప్పేవి కావు. మళ్లీ ఎన్నకటి కష్టాలు వస్తాయి.. భూముల ధరలు పాతాళానికి పడిపోతాయి. సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నాశనమవుతుంది. ఉపాధి కరువవుతుంది. మళ్లా వలసలు షురూ అవుతాయి.. ఇతర రాష్ట్రాలు, నగరాలకు బస్సులు ప్రారంభమవుతాయి. సాగు పడిపోతుంది.. ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుంది. వ్యవసాయంపై ఆధారపడిన 70 శాతం కుటుంబాలు ఆదాయాన్ని కోల్పోతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది.

**కరెంట్ సరిపోదు**

అసెంబ్లీ ఎన్నికల్లో చేస్తున్న వాగ్ధానాలు రైతులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. సమైక్య పాలనలో వ్యవసాయం అంటేనే విరక్తి పుట్టించారు. ఉమ్మడి జిల్లాను వలసలకు నిలయంగా చేసి ఏకంగా 10 లక్షల మంది కూలీలు ఇతర దేశాలు, రాష్ట్రాలకు వలసలు వెళ్లేలా చేసిన పాపం వారే మూటకట్టుకున్నారు. అయినా కాంగ్రెస్ ఇంకా తనివితీరలేనట్లు వ్యవహరిస్తున్నది. తెలంగాణలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమివ్వడం, సేద్యం పండుగలా మారడం.. రైతుబంధు, రైతుబీమా, ఇతర పథకాలు కర్షకులకు భరోసానివ్వడంతో ఆర్థికంగా ఎదిగారు. ఇది చూసిన కండ్లు మండుతున్న హస్తం పార్టీ రైతులను మోసం చేసేందుకు చూస్తున్నది. మూడు గంటల కరెంట్‌తో సాగు కష్టమవుతుంది. ఏ రకంగా చూసినా సాగు విస్తీర్ణం తగ్గుతుంది. దాని తోడు 10 హెచ్‌పీ మోటర్లతో ఆర్థిక భారం పడుతుంది. రైతుబంధులో కౌలు దారులు, రైతుల మధ్య పంచాయితీతో శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లుతుంది. కరెంట్ కట్ చేసి భూమికి భద్రత లేకుండా చేస్తారు. దీంతో గ్రామీణ వ్యవస్థ దెబ్బతింటుంది. ఈ పరిణమాలన్నీ కలగలిపి భూముల ధరలు కిందకు చేరుతాయి. ఆత్మహత్యలు పెరిగే అవకాశం లేకపోలేదు.

**ధరణి తీస్తే దౌర్జన్యమే..**

ధరణిని ఎత్తేసి పట్వారీ, పటేళ్ల వ్యవస్థను తీసుకు రావాలని కాంగ్రెస్ కుట్ర పన్నుతున్నది. దీంతో రైతులకు మళ్లా కష్టాలు మొదలుకానున్నాయి. భూమికి రక్షణ పోతుంది. తిరిగి దళారులు పుట్టుకొస్తారు.. భూమికి రక్షణ పోతుంది. భూములపై పట్వారీల అజమాయిషీ వస్తుంది. కౌలు దారు కాలంతో వ్యవసాయం చేయలేని రైతులు బీడుగా పెడతారే కానీ కౌలుకు మాత్రం ఇవ్వరు. కాంగ్రెస్ చెప్పే వాగ్దానాలు, హామీలు ఏదీ చూసినా ప్రజలను గందరగోళంలో పడేసేలా ఉన్నాయి. ఎంతో కష్టపడి సీఎం కేసీఆర్ సారథ్యంలో నిర్మించుకున్న వ్యవస్థ కుప్పకూలుతుంది. కరెంట్‌ను కుదించడంతో ఎత్తిపోతల మోటర్లు నడవడం కష్టమే.. సాగునీరు పారదు.. రైతులకు మళ్లా పాత కష్టాలే... కానీ తెలంగాణ వచ్చాక భూమి ధరలు పెరిగి రైతులు వృద్ధిలోకి వచ్చారు. ఆత్మహత్యలు నిలిచిపపోయాయి. బతుకుకు భరోసా ఏర్పడింది. అందుకే బీఆర్‌ఎస్ పథకాలకు మించినవి ఏవీ లేవని, ఈసారి తమ మద్దతు బీఆర్‌ఎస్‌కే అంటూ రైతులు ప్రకటిస్తున్నారు. కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు.